క్లుప్తంగా

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న పంచాయతీ కార్యదర్శి

బెజ్జూర్: బెజ్జూర్ గ్రామపంచాయతీలో సోమవారం నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల భూమిపూజ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వైకుంఠం పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇస్తుందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు గుమ్ముల శ్రీనివాస్, షెణ్ముఖ చారి, గ్రామ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ అజీస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న నాయకులు

బెజ్జూర్: మండలంలోని చిన్నసిద్ధాపూర్ గ్రామానికి చెందిన సెండే సావిత్రిబాయికి సీఎం సహాయ నిధి చెక్కును మండల నాయకులు పంపిణీ చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్ ఆదేశాల మేరకు సోమవారం ఆమె భర్త రాజుకు రూ.34వేల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో తాజా మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్, గౌతూరి రమేశ్, సామల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి



రైతులతో మాట్లాడుతున్న రామ్మోహన్ రావు

బెజ్జూర్: భారీ వర్షాల నేపథ్యంలో మండల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రామ్మోహన్‌రావు అన్నారు. సోమవారం కుష్ణపల్లి, సుశ్మీర్ గ్రామాల మధ్య గల ఒర్రెను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. వర్షాలు కురుస్తున్న సమయంలో ఎవరూ కూడా బయటకు వెళ్లొద్దని తెలిపారు. అలాగే వరద నీటితో ఉధృతంగా ప్రవహించే వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయకూడదని సూచించారు.

జైనూర్: రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలతో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఆడ బీర్షావ్ అన్నారు. సోమవారం మండలంలోని లేండిగూడ లోలెవల్ వంతెన పైనుంచి వరద ఉధృతంగా పారుతుండడంతో ప్రజలను అప్రమత్తం చేశారు. లేండిగూడ మీదుగా జైనూర్ మండల కేంద్రానికి రావొద్దని పేర్కొన్నారు.

ఘనంగా దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం



నూతన ఆర్చీ ప్రారంభిస్తున్న జీఎం

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా ఖైరిగూడ ఓసీపీ ఆవరణలో గల శ్రీ కనకదుర్గాదేవి ఆలయ 17వ వార్షికోత్సవ వేడుకలను సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి బెల్లంపల్లి ఏరియా జీఎం విజయ భాస్కర్ రెడ్డి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆలయం ఎదుట నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్చీని ప్రారంభించారు. అనంతరం ఆలయంలో పూజలు చేసి హోమం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రాజెక్టు మేనేజర్ నరేందర్, ప్రాజెక్టు ఇంజనీరు వీరన్న, మేనేజర్ శంకర్, వెల్ఫేర్ అధికారి రజనీకుమార్, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, ఫిట్ కార్యదర్శి శ్రీనివాస్, యూనియన్ల నాయకులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన



పూజలు చేస్తున్న నాగేశ్వర్‌రావు

ఆసిఫాబాద్‌రూరల్: ప్రతీ ఒక్కరు భక్తిమార్గం ఎంచుకోవాలని మాజీ జెడ్పీటీసీ నాగేశ్వర్ రావు అన్నారు. సోమవారం మండలంలోని చిర్రకుంట గ్రామంలో హనుమన్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

లోలెవల్ వంతెనలతో తిప్పలు

- బ్రిడ్జి పైనుంచి పారుతున్న వరద
- అత్యవసర సమయాల్లో తప్పని కష్టాలు
- రాకపోకలకు అంతరాయం



మాణిక్యపూర్‌లో లోలెవల్ వంతెన వద్ద వరద నీటిలో బైక్‌ను మోసుకెళ్తున్న యువకులు (ఫైల్)

తిర్యాణి: వానాకాలం వచ్చిందంటే మండలంలోని దాదాపు సగానికి పైగా గ్రామాలకు బహ్యప్రపంచంతో సంబంధాలు పూర్తిగా తెగిపోతున్నాయి. ఓవైపు అంతంత మాత్రంగానే ఉన్న మట్టి రోడ్లు వర్షానికి పూర్తిగా బురదమయంగా మారి నడవడానికి కూడా వీలు లేకుండా ఉంటున్నాయి. మరోవైపు మోస్తరుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు ఉప్పొంగి లోలెవల్ వంతెనలపై నుంచి వరద నీరు పారుతోంది. దీంతో రాకపోకలు గంటల తరబడి స్తంభిస్తున్నాయి. ఏళ్లగా మండలవాసులు ఆయా ప్రభుత్వాలు, అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోకపోవడంతో నరకం అనుభవించాల్సిన పరిస్థితి నెలకొంటుంది.

నిలిచిపోతున్న రాకపోకలు..

మండలంలో ఓ మోస్తరు వర్షం కురిసినా రాకపోకలు నిలిచిపోతున్నాయి. మండల కేంద్రం నుంచి శ్రీ-ఇన్‌క్లెయిన్ వెళ్లే దారిలోని విజయనగరం గ్రామ శివారులో ఉన్న లో లెవల్ వంతెనపై వరద నీరు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో వంతెనకు ఇరువైపులా వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయి. కాగా మండల కేంద్రం నుంచి ఇతర ప్రాంతాలకు ఇదే ప్రధాన రహదారి కావడంతో నిత్యం వందలాది మంది ప్రజలు, అధికారులు, ఉద్యోగులు ఇదే మార్గంలో ప్రయాణం చేస్తుంటారు. వర్షం కురిస్తే వాగు ఉప్పొంగి గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఉమ్మడి మంగి పంచాయతీ నుంచి మాణిక్యపూర్ మండల కేంద్రానికి రావడానికి కూడా ఇబ్బందులు తప్పడం లేదు. మాణిక్యపూర్ శివారులోని లో లెవల్ వంతెనపై నీరు ఉప్పొంగి ప్రవహిస్తుంది. వీటితో పాటు మాణిక్యపూర్ నుంచి రొంపెల్లికి వెళ్లే దారిలో ఉన్న వంతెన, విజయనగరం నుంచి లింగిగూడకు వెళ్లే దారిలోని రాంబాయిగూడ గ్రామ శివారులోని లో లెవల్ వంతెన, దంతన్‌పెల్లి నుంచి పంగిడిమాదర వచ్చే దారిలో బుగ్గగూడ వద్ద ఉన్న లో లెవల్ వంతెనలపై నీరు పారుతుండటంతో ఆయా అవసరాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం..

వాగులు లోలెవల్ వంతెనపై నుంచి ఉప్పొంగి ప్రవహిస్తున్న సమయంలో కొంతమంది యువకులు ప్రమాదకరంగా రాకపోకలను సాగిస్తున్నారు. కాగా అత్యవసర సమయంలో రోగులు, చిన్నారులు లో లెవల్ వంతెనలను దాటే పరిస్థితి ఉండకపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. ప్రమాదాలు జరగకుండా ప్రజల రవాణాకు వీలుగా ఉండేలా హైలెవల్ వంతెన(బ్రిడ్జి) లను నిర్మించాలని మండల వాసులు కోరుతున్నారు.

చాలా కష్టమవుతుంది..



నేను వ్యాపారం నిమిత్తం ప్రతీరోజు ఐబీ తాండూర్‌కు వెళ్తాను. దారిలో ఉన్న విజయనగరం, రాంబాయిగూడ శివారులోని లోలెవల్ వంతెనల వద్ద తరచూ వాగు ఉప్పొంగి ప్రవహించడంతో గంటల తరబడి రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. దీంతో సమయం వృథా అవుతుంది. అత్యవసర సమయంలో మస్తు ఇబ్బంది అవుతుంది.
– మ్యాన రాజు, తిర్యాణి

హై లెవల్ బ్రిడ్జీలు నిర్మించాలి



మండలంలోని వివిధ గ్రామాలల్లో నిర్మించిన లో లెవల్ వంతెనలపై నుంచి వరద నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలు స్తంభిస్తున్నాయి. లో లెవల్ వంతెన ఉన్న ప్రాంతాల్లో హైలెవల్ వంతెనలు నిర్మించాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని బ్రిడ్జీల నిర్మాణం చేపట్టాలి.
– సార రమేశ్ గౌడ్, మాజీ ఎంపీటీసీ, గడలపెల్లి

నీట మునిగిన పంటల పరిశీలన



నష్టపోయిన పంటను పరిశీలిస్తున్న నాయకులు

దహెగాం: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో మండలంలోని పెసరికుంట గ్రామ శివారులో గల వరద వల్ల నష్టపోయిన పంటలను సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోతుగంటి భీమన్న ఆధ్వర్యంలో పరిశీలించారు. ఎమ్మెల్సీ దండె విఠల్ ఆదేశాల మేరకు ముంపు ప్రాంతాలను పరిశీలించామని వారు పేర్కొన్నారు. వరదలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నాయకులు నగేశ్, గందె వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

బీజేపీలో చేరికలు



బీజేపీలో చేరుతున్న యువత

ఆసిఫాబాద్‌రూరల్: బీజేపీ చేపడుతున్న సంక్షేమ పథకాలను చూసి యువత బీజేపీలో చేరుతున్నారని వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్, బీజేపీ నాయకుడు అరిగెల నాగేశ్వర్‌రావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కంచుకోట వార్డు మాజీ సభ్యుడు చిట్టిబాబు ఆధ్వర్యంలో యువత బీజేపీ చేరారు. నాగేశ్వర్ రావు వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

టీఎల్ఎంల ప్రదర్శన



కెరమెరి: అధికారులు అందజేసిన ప్రశంసాపత్రాలతో ఉపాధ్యాయులు



పెంచికల్‌పేట్: ప్రదర్శనలను పరిశీలిస్తున్న ఎంఈవో రమేశ్‌బాబు

కెరమెరి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఎంఈవో ఆడే ప్రకాశ్ ఆధ్వర్యంలో టీఎల్ఎం (టీచర్ లెర్నింగ్ మెటీరియల్) మేళా నిర్వహించారు. మొత్తం 56 పాఠశాలలకు గాను 53 పాఠశాలలు ఉపాధ్యాయులు హాజరై టీఎల్ఎం ప్రదర్శించారు. జ్యూరీ సభ్యుల ఆధ్వర్యంలో వీటిని పరిశీలించారు. ఆకట్టుకున్న టీఎల్ఎంకు ఎస్సై మధుకర్, తహసీల్దార్ బూమేశ్వర్, ఎంఈవో ఆడే ప్రకాశ్ మెమోంటోలతో పాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, భరత్‌కుమార్ ఉపాధ్యాయులు ఉన్నారు.

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలో మండలస్థాయి టీఎల్ఎమ్ మేళాను ఎంఈవో రమేశ్‌బాబు సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో బోధిస్తున్న ఉపాధ్యాయులు విద్యార్థుల్లో సామర్థ్యాలను సాధించడానికి టీఎల్ఎమ్‌ల ద్వారా తరగతి గదుల్లో బోధించాలన్నారు. ఆయా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు విషయాల వారీగా టీఎల్ఎమ్‌లను తయారు చేసి ప్రదర్శించారు. ఉత్తమ ప్రదర్శనలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు.

చింతలమానెపల్లి: బోధనలో సృజనాత్మకతను వినియోగిస్తే విద్యార్థులకు సులువుగా బోధించవచ్చని మండల విద్యాధికారి జయరాజ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి టీఎల్ఎం మేళా నిర్వహించారు. ఈమేళాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయి పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు బోధన అభ్యసన సామగ్రి ప్రదర్శించారు. ఆయా స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పెద్దులు, సుదర్శన్, డి.సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముంచెత్తిన వరద

- దంచి కొట్టిన వర్షం



ఆశ్రమ బాలికల పాఠశాలలో చేరిన వరద నీరు



వాంకిడి ప్రధాన మార్కెట్ ఏరియాలో వరద నీరు

వాంకిడి: రెండు గంటల పాటు ఎడతెరిపి లేకుండా సోమవారం మండల కేంద్రంలో కురిసిన భారీ వర్షానికి ఆయా కాలనీలలో, ప్రధాన మార్కెట్ ఏరియాలో వరద నీరు ఉప్పొంగి ప్రవహించింది. భారీగా వరద నీరు రోడ్డుపైకి చేరడంతో దుకాణాలు, నివాసాలు జలమయమయ్యాయి. మురుగు కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో మండల కేంద్రం జలదిగ్బంధమైంది. వివిధ కాలనీల్లో ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఎంపీవో ఖాజాఅజీజుద్దిన్, ఎస్సై ప్రశాంత్ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది, హైవే సిబ్బంది సహాయంతో వరద నీటిని తొలగించేలా చర్యలు తీసుకున్నారు.

నేలకొరిగిన వృక్షాలు

సిర్పూర్(టి): మండలంలో కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు చెట్లు నేలకొరిగాయి. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో సిర్పూర్(టి) –చీలపెల్లి ప్రధాన రహదారిపై భారీ వృక్షం కిందపడిపోవడంతో గంటల తరబడి రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామపంచాయతీ సిబ్బంది స్పందించి చెట్టును తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశం



అడ్మిషన్ పత్రాలు అందజేస్తున్న అధికారులు

కెరమెరి: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మహిళా సంఘాల్లోని మహిళలు సోమవారం టెన్త్, ఇంటర్‌లలో ప్రవేశాలు పొందారు. పదో తరగతిలో పది మంది, ఇంటర్‌లో ఇద్దరు ప్రవేశం పొందగా ఎంఈవో ఆడే ప్రకాశ్, కోర్స్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ అడ్మిషన్ పత్రాలను వారికి అందజేశారు. ఏపీఎం ముక్తేశ్వర్ మాట్లాడుతూ మండలంలోని వివిధ సంఘాల్లో ఉన్న వంద మందిని ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకోగా 55 మందిని గుర్తించామని, అందులో 30 మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారన్నారు. ఈ నెల 28లోగా ప్రవేశాలు పూర్తి చేస్తామని పేర్కొన్నారు. కోర్స్ అసిస్టెంట్ సంతోష్ కుమార్, ఐకేపీ సీసీ శ్యాంరావు, సుబ్బారావు తదితరులు ఉన్నారు.

పర్యాటకుల సందర్శనకు బ్రేక్



జలకళతో గుండాల జలపాతం

తిర్యాణి: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని గుండాల జలపాతం కనువిందు చేస్తుంది. కాగా జలపాతం వద్ద వరద ఉధృతి అధికంగా ఉండటంతో పర్యాటకుల సందర్శన తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఏకో టూరిజం కమిటీ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తదుపరి ప్రకటన వచ్చే వరకు జలపాతం వద్దకు ఎవరూ రావద్దని సూచించారు.

ఆలయంలో ఎక్కాహం

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని మోతుగూడ గ్రామంలో ప్రసన్న భక్తఆంజనేయ ఆలయంలో సోమవారం ఎక్కాహం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ శ్రావణ మాసం పురస్కరించుకుని ఆలయంలో 24గంటల పాటు భక్తిశ్రద్ధలతో భజన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. రెండోరోజు జెండా విష్కరణ, అన్నదాన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు రాజయ్య, ప్రభాకర్, వినోద్, అన్నరావు, దాదాజీ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సర్వాయి పాపన్న గౌడ్ జయంతి



కౌటాల: పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్సీ విఠల్



దహెగాం: జెండా ఎగురవేస్తున్న నాయకులు

దహెగాం: బహుజన బంధు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సోమవారం మండల కేంద్రంతో పాటు హత్తిని గ్రామంలో ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలో జెండా ఎగురవేశారు. గౌడ సంఘం నాయకులు మాట్లాడుతూ సమ సమాజ స్థాపన కోసం ఎనలేని కృషి చేశారన్నారు. గౌడ సంఘం గ్రామ కమిటీ అధ్యక్షుడు బైరి తిరుపతి, నాయకులు సంతోష్‌గౌడ్, కాసారపు నగేశ్‌గౌడ్, సిద్ధుగౌడ్, నరేందర్‌గౌడ్, కోండ్ర శ్రీనివాస్, బండి పోశన్న తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను ప్రతి ఒక్కరూ సాధించాలని ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. మండల కేంద్రంలోని గౌడ సంఘం భవనంలో సోమవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375వ జయంతి మండల గౌడ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్న గౌడ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీ మాజీ చైర్మన్ సిడాం గణపతి, పార్టీ మండల కన్వీనర్లు నికాడే గంగారాం, ఉమా మహేశ్, సంఘం నాయకులు బండి రాజేందర్‌గౌడ్, వినోద్, నవీన్, చందు, సాయి, కరుణాకార్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

తిర్యాణి: సర్దార్ సర్వాయి పాపన్న ఆశయ సాధనకు కృషి చేయాలని మోకు దెబ్బ, గౌడ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. పాపన్న 375 జయంతి సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు జువ్వాజి అనిల్ గౌడ్, బొమ్మగాని శంకర్ గౌడ్, తాళ్ల శ్రీనివాస్ గౌడ్, జుంగోని అశోక్ గౌడ్ తదితరులు ఉన్నారు.

రెబ్బెన: మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో సోమవారం సర్దార్ సర్వాయి పాపన్న 375వ జయంతి గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు మోడెం సుదర్శన్‌గౌడ్, నాయకులు సర్వేశ్వర్‌గౌడ్, అన్నపూర్ణ మురళీగౌడ్, చిరంజీవిగౌడ్, భార్గవ్ గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, ప్రభాకర్ గౌడ్, కాంగ్రెస్‌పార్టీ నాయకులు గోగర్ల రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల అరెస్టు



బెజ్జూర్: అరెస్టయిన బీజేపీ నాయకులు

దహెగాం: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 49 జీవోను రద్దు చేయాలని కోరుతూ అటవీశాఖ కార్యాలయం ముట్టడికి సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు పిలుపునివ్వగా ముందస్తుగా బీజేపీ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు లగ్గాము దామోదర్, సహకార సంఘం వైస్‌చైర్మన్ రాపర్తి ధనుంజయ్‌లను అరెస్టు చేశారు.

బెజ్జూర్‌లో..

బెజ్జూర్: శాంతియుత నిరసనకు అవకాశం లేకుండా పోలీసులు అక్రమ అరెస్టు చేయడం దారుణమని బీజేపీ నాయకులు అన్నారు. సోమవారం తెల్లవారుజామున 4 గంటలకు అక్రమంగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ బీజేపీ నాయకులు, కార్యకర్తలతో పాటు పోడు రైతులను పోలీసులు అరెస్ట్ చేయడం సరికాదన్నారు.

చింతలమానెపల్లి: మండలంలోని బీజేపీ నాయకులను పోలీసులు సోమవారం ముందస్తు అరెస్టు చేశారు. అటవీ కార్యాలయాలను ముట్టడించనున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నాయకులను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

నీట మునిగిన వంతెన.. నిలిచిన రాకపోకలు



నీట మునిగిన కర్వెతగూడ వంతెన

కెరమెరి: మండలంలో సోమవారం కురిసిన భారీ వర్షానికి మరోసారి కర్వెతగూడ వంతెన పూర్తిగా నీట మునిగింది. దీంతో ఆదివాసీలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని వివిధ ప్రాంతాల్లో కురిసిన వర్షంతో లక్మాపూర్, అనార్‌పల్లి వాగుల ఉధృతి తగ్గడం లేదు. దీంతో వాగు అవతల గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కెరమెరి, సాంగ్వి, గోయగాం వాగులు పొంగిపొర్లుతున్నాయి. కాగా సాంగ్వి, రాంపూర్, ఇంద్రానగర్, కెలికే కల్వర్టులపై నుంచి నీరు పారుతుండడంతో అనేక గ్రామాలకు చెందిన ప్రజలు ఎక్కడిక్కడ నిలిచిపోయారు. వాగుల పరీవాహక ప్రాంతాల్లో అనేక ఎకరాల్లో పంటలు నీట మునిగాయి.

పీఆర్‌టీయూటీఎస్ మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

పెంచికల్‌పేట్: పెన్షన్ విద్రోహ దినం పురస్కరించుకుని సెప్టెంబర్ 1వ తేదీన హైదరాబాద్‌లో పీఆర్‌టీయూ టీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే మహాధర్నా విజయవంతం చేయాలని సంఘ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో ధర్నా పోస్టర్లు ఆవిష్కరించారు. రమేశ్ బాబు, సంతోష్, అఫ్తాబ్, గంగాభవా ని, నాగరాణి, తిరుమల, వనిత, రోజా, ప్రియాంక, భాగ్య, లక్ష్మి, ఉజ్వల, శ్రీకాంత్, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

సంతలో రైతన్న సందడి



కౌటాల మండల కేంద్రంలో సోమవారం వారసంతలో రైతన్నలు సందడి చేశారు. పొలాల అమావాస్య పండుగ నేపథ్యంలో రైతులు తమ ఎద్దులను అలంకరించుకునేందుకు అలంకరణ సామగ్రి కొనుగోలు చేశారు. పండుగ ముందు చివరి వారసంత కావడంతో రైతులు పలు రకాల వస్తువులు కొనుగోలు చేశారు.
–కౌటాల

‘తప్పుడు కేసు ఎత్తి వేయాలి’

ఆసిఫాబాద్: జిల్లా లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాది నరహరిపై పెట్టిన తప్పుడు కేసు ఎత్తివేయాలని జిల్లా కేంద్రంలోని న్యాయవాదులు డిమాండ్ చేశారు. సోమవారం కోర్టు ఆవరణలో విలేకరులతో మాట్లాడుతూ న్యాయవాదికి చెందిన వ్యవసాయభూమిని కొంత మంది కబ్జా చేయడానికి ప్రయత్నిస్తే అడ్డుకున్న న్యాయవాదిపై పోలీస్ స్టేషన్‌లో తప్పుడు కేసు నమోదు చేయడం సరికాదన్నారు. తప్పుడు కేసు పెట్టిన ఎస్సైపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నెల 7 నుంచి కోర్టు విధులు బహిష్కరిస్తామని తెలిపారు. న్యాయవాదులు టి. సురేశ్, ఎం.సురేశ్, బోనగిరి సతీశ్‌బాబు, శ్రీనివాసరావు, శ్యాంకుమార్, రవీందర్, రాజీవ్ రెడ్డి, రాపర్తి రవీందర్, న్యాయవాదులు పాల్గొన్నారు.